# గోశాలకు ఆవుల తరలింపు



**శెనార్తి మీడియా, జమ్మికుంట:**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం వావిలాల గ్రామంలో డిసెంబర్ 29న అనుమానాస్పదంగా ఆవులను తరలిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. హుజురాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన జక్కుల ఓదెలు ఆవులను తరలిస్తుండగా గ్రామస్తులు గమనించి గోరక్ష ప్రముఖ్ దేవులపల్లి నవీన్‌కు సమాచారం అందించారు. నవీన్ సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. అనుమానం వ్యక్తం కావడంతో ఓదెలుపై కేసు నమోదు చేసి ఆవులను భూపాలపల్లి గోశాలకు తరలించారు.

# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**శెనార్తి మీడియా, జమ్మికుంట:**



కరీంనగర్ జిల్లా వీణవంక మండలం హిమ్మత్‌నగర్ గ్రామానికి చెందిన మ్యాక సమ్మయ్య ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తూ ధైర్యం చెప్పారు.

# అడవి పంది వేట... ముగ్గురు అరెస్ట్

తాండ్లపేట, మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం తత్రపోషగూడెం గ్రామంలో అక్రమంగా అడవి పందిని వేటాడి వండుకొని వినియోగించిన ఘటనలో అటవీ శాఖ అధికారులు సోదాలు నిర్వహించారు. నమ్మదగిన సమాచారం ఆధారంగా తాండ్లపేట అటవీ రేంజ్ అధికారి సుష్మా రావు, ఉప రేంజ్ అధికారి మమత, అటవీ బీట్ అధికారి రహీముద్దీన్ నిందితుల నివాసాల్లో దాడులు చేశారని అధికారులు తెలిపారు. గడ్డం భీమయ్య, తత్ర భీమయ్య, కొత్తపల్లి పోశం నేరానికి ప్రత్యక్షంగా పాల్పడ్డట్టు విచారణలో తేలిందని పేర్కొన్నారు. గడ్డం భీమయ్య, తత్ర భీమయ్య ఇళ్లలో అడవి పంది మాంసాన్ని స్వాధీనం చేసుకున్నట్టు వివరించారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టంఉ1972 నిబంధనల ప్రకారం కేసు నమోదు చేసి నిందితులను ల్సట్టిపేట న్యాయప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్టు అధికారులు చెప్పారు. న్యాయస్థానం 14 రోజుల న్యాయహిరాసత విధించి ల్సట్టిపేట జైలుకు తరలించినట్టు తెలిపారు.

# వైద్య సేవల్లో నాణ్యత పెంచాలి

## ఎం.సి.హెచ్ తనిఖీలో డి.ఎం. హెచ్.ఓ ఆదేశం



**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని (వీజు) జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించిన ఆమె, రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తూనే, సేవల నాణ్యతను మరింత మెరుగుపరచాలని సిబ్బందిని ఆదేశించారు. వార్డుల వారీగా క్షుణ్ణంగా పరిశీలన ముందుగా ఆమె ఎస్.ఎన్.సి.యు (రాచీజఖ) వార్డును సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న శిశువుల ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. వైద్య రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం, శిశువుల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి పలు మార్గదర్శకాలు జారీ చేశారు.

రోగులతో ముఖాముఖి

అనంతరం పాలియేటివ్ కేర్, లేబర్ రూమ్ విభాగాలను సందర్శించిన డి.ఎం.ఉహెచ్.ఓ, అక్కడ చికిత్స పొందుతున్న గర్భిణీలు మరియు రోగులతో నేరుగా మాట్లాడారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ గురించి ఆరా తీశారు. ‹గర్భిణీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత వైద్యులపై ఉంది‹ అని ఆమె స్పష్టం చేశారు.

రికార్డుల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు చివరగా ఆసుపత్రిలోని హెల్ప్ డెస్క్‌ను తనిఖీ చేసిన ఆమె, ఆసుపత్రి రికార్డుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించకూడదని అధికారులను ఆదేశించారు. డేటా నమోదులో పారదర్శకత ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పద్మ, మార్త, వసుమతి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యుత్ సరఫరాకే సబ్ స్టేషన్ల ఏర్పాటు: కలెక్టర్

**- హాజీపూర్ మండలం రాపల్లిలో స్థల పరిశీలన**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేని, నాణ్యమైన విద్యుత్తును అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం హాజీపూర్ మండలం రాపల్లి ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న విద్యుత్ సబ్ స్టేషన్ కొరకు ఆయన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. రాపల్లి పరిసర ప్రాంతాల్లో లో-వోల్టేజ్ సమస్యలు తలెత్తకుండా, నిరంతర విద్యుత్ అందించేందుకు ఈ సబ్ స్టేషన్ ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. దీనికి సంబంధించి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రజావసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో హాజీపూర్ మండల తహసీల్దార్ శ్రీనివాస్ రావు దేశ్ పాండే, విద్యుత్ శాఖ అధికారులు మరియు ఇతర సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# చంద్రవెల్లిలో 'ప్రకృతి వ్యవసాయం'పై అవగాహన సదస్సు

**- నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ కింద గ్రామం ఎంపిక**

**- 125 మంది రైతులకు శిక్షణే లక్ష్యం: జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ**




శెనార్తి మీడియా, మంచిర్యాల : నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ ఫార్మింగ్ ( ఎన్ ఎన్ ఎన్ ఎఫ్) పథకంలో భాగంగా సోమవారం చంద్రవెల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సహజ వ్యవసాయంపై అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ చిలిముల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు జిల్లా వ్యవసాయ అధికారి (ణూూ) సురేఖ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం ఆమె రైతులకు అవగహన కలిపించారు.

– 2025-26 కు చంద్రవెల్లి ఎంపిక : జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

కేంద్ర ప్రభుత్వ పథకమైన నేషనల్ మిషన్ ఆన్ నేచురల్ అగ్రికల్చర్ స్కీమ్ కింద 2025-26 సంవత్సరానికి గాను చంద్రవెల్లి గ్రామం ఎంపికైందని వెల్లడించారు. ఈ గ్రామంలోని 125 మంది రైతులను ఎంపిక చేసి, ఒక్కొక్కరితో ఒక ఎకరం చొప్పున సహజ పద్ధతిలో సాగు చేయించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వీరికి బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కే వి కే) సహకారంతో గ్రామ స్థాయిలోనే నిరంతరం శిక్షణ, మెలుకువలు అందిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

– ఆరోగ్యమే మహాభాగ్యం.. రసాయనాలు వద్దు : మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్

రైతులు అవసరానికి మించి ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూసారంతో పాటు పర్యావరణం మరియు మానవ ఆరోగ్యం దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు ఈ సహజ వ్యవసాయ పథకాన్ని అందిపుచ్చుకుని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరారు.

– క్షత్రస్థాయిలో శిక్షణ :కేవీకే శాస్త్రవేత్త ప్రియా సుగంధి

రైతులకు సహజ ఎరువుల తయారీపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. రైతు స్థాయిలోనే జీవామృతం, బీజామృతం, అగ్న్యాస్త్రం వంటి వాటిని తక్కువ ఖర్చుతో ఎలా తయారు చేసుకోవచ్చో వివరించారు. అనంతరం ఏడిఏ రాజానరేందర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, రైతుకు పెట్టుబడి ఖర్చు తగ్గి నికర ఆదాయం పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజకుమార్, బెల్లంపల్లి ఏఈఓ తిరుపతి, వీఓ అధ్యక్షరాలు మరియు గ్రామంలోని రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీసీ ఐక్యవేదిక నేతలకు విశ్వకర్మ మహాసభ ఘన సన్మానం

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

మంచిర్యాల పట్టణంలోని బిఎన్ ఆర్కేఎస్ జిల్లా కార్యాలయంలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ ఆధ్వర్యంలో బీసీ ఉద్యమ నేతలకు ఘనంగా సన్మానం జరిగింది. ఇటీవల బీసీ కులాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మంచర్ల సదానందంతో పాటు, బీసీల రాజ్యాధికారం కోసం అలుపెరగని పోరాటం చేస్తున్న గుమ్ముల శ్రీనివాస్‌లను విశ్వకర్మ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి మునిగంటి శ్రీనివాస్ చారి ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. అఖిల భారత విశ్వకర్మ మహాసభ తమను గుర్తించి సత్కరించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో వెనుకబడిన తరగతులన్నింటినీ ఏకం చేసి, బీసీల రాజ్యాధికారమే అంతిమ లక్ష్యంగా క్షత్రస్థాయిలో పనిచేస్తామని వారు స్పష్టం చేశారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బీసీల హక్కుల సాధనలో ముందుంటామని తెలియజేస్తూ, విశ్వకర్మ మహాసభ సభ్యులకు కృతజ్ఞతలు మరియు ఉద్యమ వందనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంబోజు శ్రీనివాస్, రవీందర్ రెడ్డి, ఎర్రోజు సాయిరాం తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# వసతిగృహ విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**



జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ పరిధిలోని వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలని ఆ శాఖ జిల్లా ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో వసతి గృహ సంక్షమ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనతో పాటు ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదు ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వసతి గృహాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం, వసతి గృహ విద్యార్థులు స్వయంగా తయారు చేసిన 2026 నూతన సంవత్సర గ్రీటింగ్ కార్డులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ పి. చంద్రయ్యలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎ ఎస్ డబ్ల్యు ఓలు ధర్మానంద్ గౌడ్, డి.చందన, కుమారస్వామి, వసతి గృహ అధికారులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో నిషేధిత చైనా మాంజా విక్రయం: ఒకరిపై కేసు నమోదు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

సంక్రాంతి పండుగ వేళ ప్రభుత్వం నిషేధించిన ప్రమాదకరమైన చైనా మాంజాను విక్రయిస్తున్న వ్యక్తిపై మంచిర్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణంలోని ఇక్బాల్ అహ్మద్ నగర్‌కు చెందిన ఎండీ అల్తపుద్దీన్ (30), తండ్రి మునీరుద్దీన్, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నిబంధనలకు విరుద్ధంగా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆదివారం సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో సీఐ ప్రమోద్ రావు తన సిబ్బందితో కలిసి సదరు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీగా చైనా మాంజా దారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ ప్రమోద్ రావు మాట్లాడుతూ.. చైనా మాంజా దారం వల్ల పక్షులతో పాటు మనుషుల ప్రాణాలకు కూడా ముప్పు పొంచి ఉంది. అందుకే ప్రభుత్వం దీనిని పూర్తిగా నిషేధించింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి చైనా మాంజాను విక్రయించినా లేదా కొనుగోలు చేసినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం అని హెచ్చరించారు. ప్రజలెవరూ ప్రమాదకరమైన చైనా మాంజాను వాడకూడదని, ఎక్కడైనా ఎవరైనా దీనిని విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని సీఐ కోరారు. ప్రాణనష్టానికి కారణమయ్యే ఇటువంటి వస్తువులకు దూరంగా ఉండి పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.

# నిర్ణీత ధరలకే సేవలు అందించాలి: అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య

**- మీ సేవ కేంద్రాల్లో ధరల పట్టిక తప్పనిసరి**

**- రైతులకు గుర్తింపు సంఖ్య కేటాయింపులో సహకరించాలి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల :**



జిల్లాలోని మీ సేవ కేంద్రాల నిర్వాహకులు నిబంధనల ప్రకారం పకడ్బందీగా కేంద్రాలను నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య ఆదేశించారు. సోమవారం నస్పూర్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ లతో కలిసి నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ సేవ కేంద్రాలు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ సంక్షమ పథకాల అమల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని, నిర్వాహకులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను ప్రజలకు కనిపించేలా ప్రదర్శించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు వసూళ్లకు పాల్పడకూడదని స్పష్టం చేశారు. కేంద్రాల పనివేళలను ఖచ్చితంగా పాటిస్తూ, హెల్ప్ లైన్ నంబర్ మరియు సంబంధిత తహసీల్దార్ వివరాలను అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతి కాలపరిమితి ముగిసిన వారు మార్చి లోగా పునరుద్ధరణ చేసుకోవాలని, కేంద్రం పొందిన వారు మాత్రమే స్వయంగా నిర్వహణ చేపట్టాలని తెలిపారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ, కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం రైతులకు కేటాయించనున్న ప్రత్యేక గుర్తింపు సంఖ్య ప్రక్రియను మీ సేవ కేంద్రాల ద్వారా చేపట్టనున్నట్లు తెలుపుతూ, ఈ విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, మీ సేవ నిర్వాహకులు పాల్గొన్నారు.

## సి.ఎం. కప్-2025 క్రీడా పోటీలకు రిజిస్ట్రేషన్ల ఆహ్వానం

**జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంత రెడ్డి**

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఃసి.ఎం. కప్-2025ః (2వ ఎడిషన్) క్రీడల కోసం గ్రామస్థాయి ఎంపికల నమోదు ప్రక్రియ ప్రారంభమైందని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంత రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విభాగాలకు చెందిన క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొనేందుకు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తి గల క్రీడాకారులు https://satg.telangana.gov.in/cmcup/ అనే అధికారిక వెబ్‌సైట్ ద్వారా తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రిజిస్ట్రేషన్లు మరియు ఇతర వివరాల కోసం మరింత సమాచారం కావాల్సిన వారు 9963539234 నంబర్‌లో సంప్రదించవచ్చని ఆయన స్పష్టం చేశారు.

